# దొంగలు

బీరప్ప తన ముంజేతి కడియాన్ని కుదువబెట్టుకుంటరేమోనని, లేదా కొంటారేమోనని వెండి, బంగారపు కొట్లన్నీ తిరిగాడు. ఒకడు "వెండిదేనా?" అంటే మరొకడు "నీదేనా" అని అడుగిన తీరును గుర్తుకు తెచ్చుకొని ఓ బరువైన శ్వాస వదిలాడు బీరప్ప.

తిరిగి తిరిగి వేసారిన బీరప్పకు బాగా ఆకలేస్తుంది. చీకటి పడింది. సినిమా టాకీసు ముందున్న బండి మీది బజ్జీలతో, మున్సిపాలటీ వాళ్ళ నీళ్ళతో కడుపు నింపుకున్న బీరప్ప, బండి వాడి సలహాపై ఆ రాత్రి పడుకోవడానికి గాంధీ పార్కు చేరాడు.

పార్కు గేటు మూసి వుంది. గేటు చువ్వల మధ్యనుండి చూస్తే గాంధీ విగ్రహం జైల్లో ఉన్నట్లు కనిపించింది. గాంధీ గారు తన జీవితంలో అధిక భాగం జైల్లో గడిపాడు అన్న పంతులు గారి మాటలు గుర్తొచ్చాయి బీరప్పకు. సచ్చినంక కూడ జైల్లనే వుంచిండ్రు అని బాధపడ్డాడు బీరప్ప. చేతులు జోడించి "అయ్యా! ఏమి సొతంత్రం తెస్తివో గానీ మా బతుకు అయ్యాల ఎట్లుందో ఇయ్యాలట్లనే వుంది. తెల్లోడు ఎల్లిపోయినా మా బతుకులు తెల్లారలేదు తండ్రీ "అంటూ రెండు మూడు సార్లు దండం పెట్టాడు. గాంధీ గారు మేకపాలు తాగేవాడని పంతులు గారు చెప్పిన మాటలు గుర్తొచ్చి "ఆ మేకలు కాసేది నేనే సూడు ! నాకెన్ని తిప్పలో " అంటూ అక్కడి నుండి నడిచాడు బీరప్ప.

పోయిన సంవత్సరం పంచాయితీ ఎన్నికల్లో తన ఊరొచ్చి "నీకెప్పుడయినా పని వుంటే నా దగ్గరికి రా ! మీ కోసమే మా పదవులు " అన్న సమితి ప్రసిడెంట్ మాటలు నమ్మి ఆర్నెల్ల నుండి ఆఫీసు చుట్టూ తిరుగుతున్నప్పుడు పడిన బాధలు ఒక్కొక్కటే కళ్ళముందుకు రాసాగాయి.

ఒకరోజు ప్రసిడెంటు గారు తన గదిలో ఉన్నట్లు తెలుసుకున్న బీరప్ప గడిముందు కూర్చున్న అటెండర్ కాశీం చేతిలో ఓ రూపాయి వుంచి, లోపలికెళ్ళి "దండం దొరా! " అన్నాడు.

ఆ రోజు దినపత్రిక చదువుతున్న వాడల్లా తలెత్తి బీరప్పను చూసి, మళ్ళీ పేపరు చదవడంలో మునిగాడు.

"నన్ను గుర్తుపట్టలే దొరా ! "

కళ్ళు పేపరు మీద వున్నా, మనసు మాత్రం ఓ సంవత్సరం వెనక్కు వెళ్ళింది. 'ఈన పేరు ఎందుకు తెలియదు. అయినా ఎందరినని గుర్తుంచుకుంటాం '

"ఎలచ్చన్లో మా ఊర్కి వచ్చిండ్రు. అందరం తమ పార్టీకే జేకొట్టి ఓటేసి గెలిపిస్తిమి"

"ఈయన ఒక్కొక్కరి ఓట్లతోనే తాను గెలిచినట్లు "అని గొణుక్కున్నాడు.

“డప్పులు, కొమ్ములతో ఊరేగిస్తిని. ఆయ్యాల్టి దావత్తుకు మీరు సారబొట్లు పంపితిరి. నేనొక యాటపిల్లనిస్తిని. ఊరంతా ఓట్ల పండగ సేస్తిమి ”

“ఇంతకూ నీకేమి కావాలి ? ” అంటూ బీరప్ప మాటలకు అడ్డు తగిలాడు ప్రెసిడెంటుగారు - వెనుకటి కథలన్నీ వినదల్చుకోక.

“గదె! గొర్రె జివ్వాల్ని కొనుక్కుంటందుకు అప్పు ఇస్తనంటే దరఖాస్తు పెట్టిన, సాన రోజులయ్యింది. తమరు తలుసుకుంటే ..... ” మాటలు పూర్తి కాకముందే.

“నీవు మందలోనుండి గొర్రెల్ని పట్టిచ్చినంత సులువు కాదు, అప్పు ఇవ్వటం” అంటూ బెల్ నొక్కాడు.

“జీ! సాబ్ ” అంటూ లోపలికొచ్చాడు ఖాశీం.

“ఈయన్ని మేనేజరు దగ్గరికి తీసుకుపో ”

“అచ్చా సాబ్! ”

తనను గుర్తుపట్టనందుకు బీరప్ప బిక్కముఖం వేసి ప్రెసిడెంటును మరీ మరీ చూశాడు. అంతే కాదు ఆయన తల మీద గోడకున్న ఇందిరాగాంధీ బొమ్మను గుర్తించాడు. “అమ్మా! నీ చెట్టుకు కాసిన నేతి బీరకాయలు ” అంటూ చేతులెత్తి దణ్ణం పెట్టి, కాశీంను అనుసరించాడు బీరప్ప.

బీరప్ప గదిలో నుండి పోగానే ఎంతో బరువు దిగినట్లనిపించింది. ‘వాడు ఎందుకు దణ్ణం పెట్టేటప్పుడు వాడి గొడ్డలి సరిగ్గా తనను నరికేటందుకు లేపినట్లు కనిపించింది. ఓటేసిన ప్రతి సన్నాసికి అప్పు ఇవ్వాలంటే...’

అంతలో ఓ జీపు హారను మోగింది. బీరప్ప అదురుకుని పక్కకు జరిగాడు. దుమ్ము లేపుతూ పోయిన జీపును చూస్తూ ‘ నీ యక్క, జర్రయితే టక్కరు పెడుతుండెనే.... ’ అనుకుని, మళ్ళీ అప్పు గురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

‘ప్రెసిడంట్ తొడేలు అనుకుంటే మేనేజరు నక్క ”

“ ఏం సంగతి బోయిడా ” మేనేజరు నవ్వుతూ.

“ఏముందొర ! గొర్రె జివ్వాలకు అప్పు ఇప్పియ్యమని దరఖాస్తు పెట్టి ఆర్నెల్లయ్యింది”

“ఈ ఆఫీసు ఏమన్నా గొర్రెనా, మేకనా నెలలను బట్టి పిల్లలను పెట్టడానికి ! ఇక్కడ జరిగే ప్రతి పనికి ఓ రూలు, ఓ పద్ధతి వుంటుంది ” అన్నప్పుడు ఎదురు సీట్లో కూర్చున్న లోన్స్ ఇన్‌స్పెక్టర్ చిన్నగా నవ్వుకొని ఓసారి బీరప్పను, మేనేజరును చూసి -

“ప్రెసిడెంటుగార్ని కలువకపోయావా ? ” అన్నాడు

“కల్సిన దొరా ”

“ఏమన్నారు ? ”

“ఇక్కడికి ! తమరి దగ్గరికే పొమ్మన్నడు ”

"పొమ్మంటేే ఏం లాభం ? "

"ఆయన గుర్తు పట్టి కూడా, గుర్తుబట్టనట్టే మాట్లాడిండు. ఆయనకు ఎలచ్చన్ల ఓటేసిన, ఓ యాటను గూడా ఇచ్చిన. ఇప్పుడవన్నీ .... "

" అఛ్ఛా ! బిడ్డా ! యాటను కూడా ఇచ్చినావా ! మరి మాక్కూడా ఓ యాటను ఇవ్వరాదూ ! " మేనేజరు.

" కోతకు పనికొచ్చేయి లేవు దొరా ! అన్నీ కొదుమలే "

"అవ్వన్నీ మాకు చెప్పకు. నీవిట్లా గొర్రెను తేగానే బి.డి.వో గారికి చెప్పి అట్ల అప్పు ఇప్పిస్తాం. ఏమంటారు ఇన్స్పెక్టర్ గారూ ? "

"మీరు తలుచుకుంటే అరగంట చాలు"

బీరప్పకు కోపం ముంచుకొచ్చింది. దొంగ కొడుకులు, తలుచుకుంటే అరగంట, తలుచుకోకుంటే ........ ఆర్నెల్లా. లోలోపల తిట్టుకున్నాడు బీరప్ప.

అన్నట్టే మరునాడు ఉదయం ఆఫీసు వెనకాల వున్న వేప చెట్టుకు కట్టేసిన గొర్రె అరుస్తూంది.

అప్పు మంజూరయిన కాగితం బీరప్ప చేతికొచ్చింది.

* * *

అర్థరాత్రి అమావాస్య రోజు. అప్పుడే కరెంటు పోయింది. పట్టణం అంతా చిమ్మచీకటి. గస్తీ తిరుగుతున్న ఓ కానిస్టేబుల్, జమేదారు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంటును తిట్టుకుంటూ నడుస్తున్నాడు. నడుస్తూ నడుస్తూ హఠాత్తుగా ఆగిపోయిన కానిస్టేబుల్ని చూసి తాను ఆగాడు జమేదారు.

"సార్ "వణుకుతున్న గొంతుతో, ముందుకు చూస్తూ.

" ఏంటోయ్ ...... ఏంటి ? "

"మీరు సరిగ్గా ముందుకు చూడండి సార్ "

ఎదురుగా మళ్ళీ చెక్ మంది.

"చూశారా ! సార్ అక్కడ చెక్ మంది ! " మనిషి పూర్తిగా వణుకుతూ.

ఈసారి రెండు సార్లు చెక్ మంది.

" అనుమానం లేదు అది కొరివి దయ్యమే ! "

"అబ్బే ! అనుమానం ఎందుకు ? రెండేళ్ళ కింద ట్రాన్స్ఫర్ అయిన మన మూర్తి ఎస్. ఐ గార్కి కూడా ఇక్కడే కనిపించిందట " జమేదారు.

ఇద్దరికీ గుండె వేగం పెరిగింది. కాళ్ళలో వణుకు మొదలయింది.

"మన దస్తగిరి కానిస్టేబుల్కు కూడా నెల క్రింద ఇక్కడే కనిపించిందట సార్!" అమాయక చూపులతో.

"వాడొట్టి పిరికి వాడు. స్టేషన్ కు పరిగెత్తుకొచ్చిండు. డ్యూటీలో ఉండి అట్ల రాకూడదు "

" అంటే మనం .....? "

"మనం డ్యూటీలో వున్నాం, పద "అంటూ జమేదారు, తన టోపీని, బెల్ట్‌ను సరిచేసుకున్నాడు.

అయినా మనం యూనిఫారం మీద ఉన్నాం కదా ! సార్ అది మన..............

అదే నేను చెప్పేది . పద.....

కానిస్టేబుల్ రెండు మూడు సార్లు కర్రను నేలకు కొట్టి, బూట్ల చప్పుడు చేశాడు. ఒక్కసారి శ్వాస పీల్చి వదిలి ఇద్దరూ ముందుకు నడిచారు. కొంచెం దూరం నడిచి మళ్లీ పరిశీలనగా చూశారు. చెక్ మనలేదు గానీ అక్కడ ఏదో మండుతుంది.

"మనం ఎక్కడున్నాం ? " జమేదారు

"డ్యూటీలో వున్నాం సార్ ! " అంటూ గట్టిగా కళ్ళు మూసుకొని తన చేతి కర్రను మండుతున్న వైపు విసిరాడు.

అంతే మండే నిప్పు కిందపడ్డది.

ఓ నల్లని ఆకారం లేచి నిల్చుంది. అక్కడంతా పొగలు సుళ్ళు తిరుగుతుంది.

" ఎవరక్కడా ? "అంటూ జమేదారు కళ్ళు మూసుకున్నాడు.

... చప్పుడు లేదు.

"దయ్యానివా ? మనిషివా? "

"మనిషినే దొరా ! "

"అమ్మయ్యా ! "అంటూ కళ్ళు తెరిచాడు జమేదారు.

" సంపావురా నా కొడకా "అంటూ కళ్ళు తెరిచిన కానిస్టేబుల్ కొంచెం ముందుకు నడిచి కర్రనందుకోబోయి వెనక్కొచ్చి -

"సార్ ! వీని దగ్గర గొడ్డలుంది "

"గొడ్డలా ! " కొంతసేపాలోచించి -

"ఏ ఊరు నీది? "

"రానకొండ "

తన కర్రనందుకొని మళ్ళీ వెనక్కొచ్చాడు.

" ఉండేది కొండల్లో, చేతిలో గొడ్డలి అంటే తప్పకుండా వీడు ..... " జమేదారు ఆలోచన వేగం పెరిగింది.

"తప్పకుండా వాడే సార్ ! "అంటూ కానిస్టేబుల్ కాస్త వెనక్కు జరిగాడు.

జమేదారు కూడా పక్కకు జరిగాడు.

ఇద్దరూ ఒకరి చేయి ఒకరు పట్టుకొని భయాన్ని అదుపులోకి తెచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

" ఏయ్ ! నీ దగ్గరున్న ఆయుధాన్ని యిటు పారేయి. లేకపోతే ఫైర్ చేయాల్సొస్తుంది " జమేదారు.

"అడవిలో తప్పించుకోగలవు కానీ, ఊళ్లో ... అందునా మా ఏరియాలో ఎటూ పారిపోలేవు. మేం డ్రస్సు మీద వున్నాం. మమ్మల్ని కూడా ఏమీ చేయలేవు. గప్‌చుప్‌గా సార్ చెప్పినట్లు చేయి "అంటూ మరొకసారి కాస్త దగ్గరికి నడిచి పరికించి చూసి -

"కాలుతున్న బాంబును ఆర్పెయ్యి "

తనకేమీ అర్థం కాక అలాగే నిల్చుంది ఆ ఆకారం.

"దాన్ని ఆర్పెయి ముందు " జమేదారు.

ఆర్పేశాడు.

"ఆ గొడ్డలి కూడా పారెయ్యి ".

పారేశాడు.

"ఆ కింద ఉన్నవీ బాంబులేనా? నీవు పక్కకు జరుగు "

పక్కకు జరిగాడు.

ఇద్దరూ వెళ్ళి క్రిందపడ్డవాటిని మెల్లగా చేతిలోనికి తీసుకొని చూసి తెల్లబోయారు. అది జఖ్‌ముఖ్ సంచి. ఇంతకు ముందార్పింది కాలుతున్న చుట్ట. ఒకరి ముఖం ఒకరు చూసుకొని ఇద్దరూ ఒకేసారి అతని వైపు చూశారు.

గొంగళి కప్పుకున్న ఆకారం చేతులు జోడించి నిల్చుంది.

" ఎవఁరా ! నీవు ? " కానిస్టేబుల్.

" బీరిగాన్నయ్యా ! "

"ఇక్కడేం చేస్తున్నవ్ ? "

" పండుకున్న దొరా "

" పండుకున్నది కాక, ఓ చుట్ట తాగి అందర్నీ పరేశాన్ చేస్తావురా ! దొంగ నాయాలా ! పద స్టేషన్‌కు " కానిస్టేబుల్.

బీరప్పకు ఎటూ అర్థం కాలేదు. నిశ్చేష్టుడై నిల్చున్నాడు.

" అరే ! నడూబే " అంటూ నెత్తి మీద కఱ్ఱతో కొట్టాడు. ఆ దెబ్బకు నెత్తి రుమాలు మడతల్లోనుండి గుడ్డతో చుట్టిన కట్ట ఊడి కింద పడింది. దాన్ని తీసుకొని జమేదారు వైపు చూశాడు.

" పద పోదాం. జానేదేవ్ భేకూఫ్ కు "అంటూ జమేదారు స్టేషన్ వైపు నడిచాడు. ఆ కట్టను జేబులో పెట్టుకుంటూ తాను ఫాలో అయ్యాడు కానిస్టేబుల్.

"అయ్యో ! ఆ సంచిలో సుట్టాకు, పావాకుంది దొరా ! " భయపడుతూనే ఆతురతతో అడిగాడు బీరప్ప.

"ఉండనీ బే. మేం మాత్రం చుట్ట తాగమా? " అంటూ వెళ్ళిపోయారు.

ఎటూ అర్థం కాని బీరప్ప 'ఈ పోలీసోళ్ళు కూడా ఇట్ల సేస్తే ఇంకెవర్కి సెప్పుకోవాలె ' అనుకుంటూ ఈ పట్నంలో ఉండే మనుషుల్ని గూర్చి ఆలోచించి, ఇది ఊరా .... అడివా ? అనుకొని, పొద్దున ఆఫీసులో జరిగిన సంఘటన గురించి ఆలోచిస్తున్నాడు.

లోన్ శాంక్షన్ ప్రొసీడింగ్ తీసికెళ్ళి అకౌంట్సు సెక్షన్లో ఇవ్వగానే అక్కౌంటెంటు గారు దాన్ని కిందా మీదా చూసి -

" ఇది మా సెక్షనుకు యింకా రాలేదు " అంటూ తిరిగి బీరప్పకు ఇచ్చాడు.

"చూడు ! కాగితం పట్టుకొని రాగానే చెక్కు చేతికొస్తదా తండ్రీ ! ఓ వారం రోజుల తరువాత రా ! " వెటకారంగా అన్నాడు అక్కౌంటెంటు గారు.

వారం అనేసరికి బీరప్పకు చలి జ్వరం వచ్చినంత పనైంది. అక్కౌంటెంటును చూస్తూ నిలుచున్నాడు.

" ఏం చూస్తవు ? ప్రొసీడింగ్ కాంగనే చెక్కు అవుద్దా ? బడ్జెట్ చూడాలి. ఆదీ గాక చెక్కు బుక్కు అయిపోయిందేమో " అని అనుమానం వెలిబుచ్చాడు.

రెప్పవాల్చకుండా చూస్తున్న బీరప్పలో అదో భావం కదిలింది. అంతలో టంగ్ మంది గోడ గడియారం.

అందరూ భోజనాలకని వెళ్ళారు.

బీరప్ప తన గొంగళి మడిచి నేల మీద వేసి దాని మీద కూర్చున్నాడు లంకలో హనుమంతుడు తన తోకచుట్ట మీద తాను కూర్చునట్లు. అప్పు కోసం దరఖాస్తు పెట్టి చాలా తప్పు పని చేశానన్నట్లు ఓ బరువైన శ్వాస వదిలాడు. గొర్రెను తిన్న నా కొడుకులకు ఇంత ఇస్వాసం లేదు, వీళ్ళకంటే నా మందకాడి కుక్క నయం, సొరెడు గంజి పోస్తే దినమంతా మందను కాసుద్ది.

మరోసారి గడియారం రెండు కొట్టింది. టంగుమని శబ్దం విన్న బీరప్ప గడియారం వైపు చూశాడు. ఎవరున్నా లేకున్నా గడియారం తనంతట తాను నడుస్తూనే వుంది. మనుషుల కంటే ఇదే నయం కదా ! అనుకుంటూ చుట్టూ చూశాడు. పైన ఫ్యాను తిరుగుతూనే వుంది. లైట్లు వెలుగుతూనే వున్నవి.

గోడ గడియారం టంగ్, టంగ్ మంటూ మళ్ళీ మూడు సార్లు కొట్టింది. అక్కౌంటెంటు ఇంకా రాలేదు. అన్నం తినడానికి ఇంతసేపు ఎందుకు పట్టిందో తనకు అర్థం కాలేదు. ముంతెడు బువ్వ మూడు గడియల్లో పూర్తి చేస్తాడు తాను. మూడు పూటలు తిన్న నా కొడుకులు ఒక్క పూట పనిచెయ్యరు. కట్టలకు కట్టలు జీతాలు

తీసుకొని తిని త్రాగడం మాత్రం తెలుసు. ఊళ్ళల్లో మానెడు గింజలకు ఎకరాలకొద్దీ పొలాన్ని దున్నుతాం. అసలు తిండి తిన్న ఒళ్ళు పనిచేయకుంట ఎట్లుంటది ? అందుకే కొత్త కొత్త రోగాలు.

" ఏమయ్యా ! నీవింకా ఇక్కడే వున్నావా ? పోలేదాబీరప్ప "

కాగితం పట్టుకొని, చెప్పులు గొంగళి దగ్గరే వదిలి అకౌంటెంటు టేబుల్ దగ్గరికి పోయి నిల్చున్నాడు.

"చూడు బోయడా ! పొగ లేందే సిగం రాదని నీకు తెలియదా ? "

బీరప్పకు ఒక్కసారే ఒళ్ళు మొద్దుబారినట్లయింది.

"అంటే ఇంకా ఇయ్యాలన్న మాట. నిన్న తిన్న గొర్రె ఇంకా అరగనేలేదు, మళ్లీ........ యాడ తిని, ఆడనే మూతి రాసే కోడి నా కొడుకులు "అంటూ లోలోపల తిట్టుకున్నాడు.

"అర్థం కాలేదా ? "అకౌంటెంటు.

"ఇప్పుడు నా దగ్గర చిల్లిగవ్వ లేద్దొరా ! "

" దగ్గరుంటాయా ? తేవాలి మరి ! అంతే "

"రేపు బాంకుల తీసుకొన్నాక తెచ్చిస్త దొరా "

" అచ్చా ! చేపకు ఈత నేర్పుతున్నావన్న మాట. "

బీరప్ప చప్పుడు చేయలేదు.

" ఆ చేతికి వుంది వెండి కడియమేగా ? "

"ఎండిది కాక రాతెండిదా ! మరి పెండ్లిల అత్తగారు పెట్టిన నగ ఇది " అంటూ చేతికున్న కడియాన్ని తిప్పి చూసుకున్నాడు. వంటి రాపిడికి అరిగిన కడియాన్ని మరీ మరీ చూసుకున్నాడు.

* * *

బ్యాంకు ఆవరణ అంతా ఇచ్చి, పుచ్చుకొనే జనంతో కిక్కిరిసి వుంది. సమితి అకౌంటెంటు కళ్ళు బీరప్పను వెదుకుతున్నాయి. హాలంతా కలియచూసి బయటి గేటు వైపు నడిచాడు. ఎదురుగా సైకిల్ దిగుతూ ట్రెజరీ అకౌంటెంటు.

" ఏం గురూ ! చెక్ క్యాష్ అయిందా "

" అయినట్టే కానీ వాడే కనిపించలేదు "

"అంటే చెక్కేశాడా ? " ఆదుర్దాగా అడిగాడు. ట్రెజరీ అకౌంటెంటు తను అనుకున్నట్లే జరిగిందని నొసలు కొట్టుకున్నాడు.

" నేను వచ్చేవరకు గేటు దగ్గరే వుండమని చెప్పా ! "

"దండగ గురూ ! నేను చెప్పానుగా ! మా దగ్గర రోజూ బ్యాంకు పేరు చెప్పి ఎంతో

మంది ఎగనామం పెడతారని "

"ఎంత మోసం చేశాడు, అమాయకుడిలా వుండి "

"చూడు గురూ ! రోగి బెడ్ మీద ఉన్నప్పుడే ఫీజు లాగాలి. రోగం కుదిరిందా, మనిషి కనపడడు, ఫీజు బాకీ పడుద్ది "

"అదీ నిజమే అనుకో ! కాని నేను అంత తెలివి తక్కువ వాన్నేం కాదుగా ! వాడి వెండి కడియం నా దగ్గరుంది "అంటూ బీరప్ప చెక్కు తీసుకొనే ముందు తన దగ్గరుంచిన కడియాన్ని జేబులోంచి చూపించాడు. దాన్ని చూసిన ట్రెజరీ అక్కౌంటెంటుకు మరో అనుమానం తగిలింది.

'ఆయన దగ్గర కడియముంటే తనకేమొస్తది ? 'అని గుర్తుకు రాగానే ఎలాగైనా అతన్ని పట్టుకోవడం తప్పనిసరి అనుకుంటూ

"బహుశా అతను బస్టాండ్ వెళ్ళొచ్చు పోదాం పద "

"అతను ఇంకా ఉంటాడంటావా ? ".

"మన ఆర్.టి.సి బస్సుల సంగతి మనకు తెలియందేముంది ? తప్పక వుంటాడు పదండి " అంటూ ఇద్దరూ సైకిలెక్కి బయలుదేరారు.

బస్టాండు నిండా జనం అటూ, ఇటూ తిరుగుతున్నారు. ఈ ఇద్దరి కళ్ళూ బీరప్పను వెదుకుతున్నాయి. దూరంగా ఒక పండ్ల బండి దగ్గర గొంగళి - తలపాగ కనిపించింది.

"అమ్మయ్య ". అంటూ ఓ సారి ఊపిరి పీల్చి ఇద్దరూ ఒక్క అంగలో అక్కడికి చేరి చూసేసరికి బీరప్ప కాడు. అతని సోదరుడెవరో .....

తన ముందుకే వచ్చి నిలుచున్న వీళ్ళను చూసి "అయ్యా ! అక్కడున్న బస్సు ఊరికి పోద్ది ? "

"మన తాత గారి ఊరికి "ట్రెజరీ అక్కౌంటెంటు జవాబు.

"అంత కోపం ఎందుకు తండ్రీ సదువు రాని సన్నాసిని, సదివి సెపుతారేమోనని అడిగిన"

"ఇంకా నయం ! నీకే చదువు చెప్పమనలే ! "సమితి అక్కౌంటెంటు.

ఇద్దరూ వెళ్ళడానికి సిద్దంగా వున్న బస్సు వేపు నడిచారు.

బస్సులో ముందు గొడ్డలి, ఆ తర్వాత ఎర్ర గీతల రుమాలు, ఆ తర్వాత బీరప్ప ముఖం కనిపించాయి. ట్రెజరీ అక్కౌంటెంటు సమితి అక్కౌంటెంటుకు సైగతో చూపించాడు. ఇద్దరూ మెల్లగా బస్సెక్కి బీరప్ప పక్కన నిల్చున్నారు.

బీరప్ప తన ఆలోచనలో తానున్నాడు. గొర్రెల్ని కొనాలి, కాలం మంచిగైతే, సంవత్సరానికే రెండింతలయితయి. దేవునికో గొర్రె పొటేల్ని యిడువాలి.

"ఏమోయి చెప్పకుండనే వచ్చినవు ? "సమితి అక్కౌంటెంటు ప్రశ్న.

బీరప్ప ఒక్క క్షణం బిత్తర పోయి చూశాడు.

"నిన్నే ! మేం బ్యాంకు దగ్గరికి వచ్చేసరికి వెళ్ళొచ్చినవ్"

"రొక్కం ఇవ్వగానే బయటికొచ్చి సూస్తి, ఎవ్వరూ కనిపియ్యలే" మళ్ళొచ్చిన్నాడు కలుసొచ్చు అని.

"ఇంకా నయం - వచ్చే జన్మలో అనలే. తియ్..తియ్... ఏదో ఈ సారు చెప్పిండని చెక్కు పాస్ చేస్తే"

బీరప్పకు వళ్ళు మండింది. ఎన్నో రోజుల నుండి అనుభవిస్తున్న బాధ కోపంగా మారింది. ముఖ కవలికలు మారినవి. కనుగ్రుడ్లు ఎర్రనైనవి. నోటిలో చుట్ట ఎర్రగా కాలుతూ పొగను వదులుతుంది. తాగుతున్న చుట్టను నేలకొట్టి, తుపుక్కున బస్సు కిటికీలో నుంచి ఉమ్మేసి -

"నీ అయ్యకేమన్నా బాకా" అంటూ ఇద్దర్వైపు చూశాడు.

"ఒరేయి ! నీ కడియం నా దగ్గర వుందిరా" అంటూ జేబులో నుండి కడియం తీసి బీరప్పకు చూపించాడు.

బీరప్ప వెంటనే లేచి కడియాన్ని లాక్కోబోయాడు. అంత వరకు చూస్తున్న ట్రెజరీ అకౌంటెంటు కూడా సమితి అకౌంటెంటుతో చేయి కలిపాడు. ముగ్గురి చేతులు కడియంలో చిక్కినవి.

బీరప్ప బస్సులో ఉన్నవార్వైపు చూసి, మళ్లీ వెంటనే కడియం వైపు, కడియం గుంజే వాళ్ళ వైపు చూశాడు.

ఇక అంతే !

"దొంగలు...దొంగలు...దొం....." అంటూ అరిచాడు.

బస్సులోని జనం ఒక్కసారే లేచి ఇద్దర్నీ చితకొట్టారు.

బస్సు కదిలింది ......

బీరప్ప చేతికి కడియం మెరుస్తోంది.

●

పందొమ్మిది వందల ఎనభై రెండులో ఆంధ్రజ్యోతి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ.

కేంద్ర సాహిత్య అకాడమీ. న్యూఢిల్లీ వారు ప్రచురించిన తెలుగు కథ లో కూడా చోటు చేసుకుంది.